క్లుప్తంగా

పరకాల కోర్టు ఏజీపీగా మొహమ్మద్ సాబీర్



పరకాల: పరకాల కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా మొహమ్మద్ సాబీర్‌ను నియమిస్తూ కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో న్యాయవాది సాబీర్‌ను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. తనపై నమ్మకంతో ఏజీపీగా నియామకం చేసేందుకు కృషి చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తానని న్యాయవాది సాబీర్ తెలిపారు.

కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



ధర్మసాగర్: ఎల్కుర్తి గ్రామంలో స్వర్ణజ్యోతి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మంగళవారం పరిశీలించారు. రోజుకు ఎన్ని యూనిఫాంలు కుడుతున్నారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ నాగపద్మజ, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలను తక్షణమే నెరవేర్చాలి



నర్సంపేట : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) డివిజన్ అధ్యక్షుడు కత్తుల కొమురయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి సదానందం హాజరై మాట్లాడారు. అర్హులకు పెరిగిన ధరలకు అనుగుణంగా పెన్షన్ ఇవ్వాలని, రైతులకు పాత రుణాలు రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల ఆసరా పథకాన్ని అమలు చేయాలన్నారు, ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం ప్రకటించడంతోపాటు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని అన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 22న తహసీల్దార్, 29న కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేస్తామన్నారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, డివిజన్ కార్యదర్శి అద్దూరి రాజు, నాయకులు మైదం పాణి, మధుసూదన్‌రెడ్డి, దారా లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' బోర్డు తొలగింపు

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని శ్రీ అరవిందో హైస్కూల్ యాజమాన్యం 'శ్రీ చైతన్య టెక్నో కరికులం' అంటూ ముద్రించి ఏర్పాటు చేసిన బోర్డును ఎంఈఓ రంగయ్య మంగళవారం తొలగింపజేశారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయంటూ సోషల్ మీడియాలో జరిగిన ప్రచారంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రంగయ్య వర్ధన్నపేటకు చేరుకుని విచారణ చేపట్టారు. శ్రీ అరవిందో హైస్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన బోర్డును తొలగింపజేసి మాట్లాడారు. శ్రీఅరబిందో హైస్కూల్ అని మాత్రమే బోర్డుపై రాసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

దామెర: మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని ఏకశిలా ప్రైమ్ పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యత సాధించాలంటే మొక్కలు విరివిగా నాటాలని అన్నారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడం, సంరక్షించడం ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా సూచించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కాలుష్యాన్ని ఎదుర్కొని ఆక్సిజన్‌ను ఇచ్చే శక్తి చెట్లకే ఉందన్నారు. ప్రకృతి ప్రాముఖ్యాన్ని అందరూ తెలుసుకోవాలని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి ప్రమాదాలకు వారధి

- ఎరుపెక్కుతున్న ఎన్‌హెచ్ 163
- మద్యం మత్తులోనే ఎక్కువ ప్రమాదాలు
- స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడం కూడా కారణమే
- సంవత్సరకాలంలో ఏడుగురు మృతి



ఊరుగొండ పెట్రోల్‌బంక్ వద్ద డివైడర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

దామెర : హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి ప్రమాదాలకు వారధిగా మారుతోంది. అతివేగం, అజాగ్రత్తతో పాటు మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం కూడా ప్రమాదాలకు కారణమని తెలుస్తుంది. జాతీయ రహదారిపై సంవత్సర కాలంలో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలవడంతో పాటు పదుల సంఖ్యలో గాయాల పాలయ్యారు. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందేనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. దామెర క్రాస్ నుంచి గూడెప్పాడ్ వరకు సుమారు 15 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఒగ్లాపూర్, ఊరుగొండ, దుర్గంపేట్, గూడెప్పాడ్ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాలు. రహదారిపైకి రావాలంటే ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్నారు. ఇటీవల నాలుగు వరుసల రహదారిగా మార్చడంతో వాహనాల వేగం కూడా పెరిగి ప్రమాదాలకు కారణమవుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు



దుర్గంపేట సమీపంలో ఢీ కొట్టిన లారీలు (ఫైల్)

కోరుతున్నారు. జాతీయ రహదారిపై ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారుల ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. డ్రంక్అండ్‌డ్రైవ్ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఊరుగొండలో బోల్తా పడిన ఆటో, మృతిచెందిన లక్ష్మి, అనంతమ్మ(ఫైల్)

ప్రమాదాల వివరాలు :

- జూన్ 4, 2023న ఒగ్లాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద లారీ ఢీ కొన్న ఘటనలో పసరగొండకు చెందిన అబ్బాస్ అక్కడిక్కడే మృతి చెందాడు.
- జూన్ 5న ఊరుగొండ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొన్న ఘటనలో శాయంపేటకు చెందిన గోరంట్ల కిరణ్ మృతిచెందాడు.
- జులై 3, 2023న దామెర మండల కేంద్రంలోని శ్రీహర్ష పాఠశాల సమీపంలో శాయంపేట మండలం, మాందారిపేటకు చెందిన అల్లం రాజకొమురయ్య ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- డిసెంబర్ 12, 2023న ఒగ్లాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద ఆర్టీసీ బస్సు పత్తిచేనులోకి దూసుకెళ్లిన ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.
- ఫిబ్రవరి25, 2024న ఊరుగొండ పెట్రోల్‌బంక్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వాహనదారునికి తీవ్ర గాయాలయ్యాయి.

ప్రమాదాలకు గల కారణాలు..

- వాహనదారులు మద్యం సేవించి వేగంగా వెళ్లడం.
- మలుపుల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, సూచిక బోర్డులు లేకపోవడం.
- పోలీస్‌లు తనిఖీలు చేపట్టకపోవడం.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : మండలంలోని యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ సంతోష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. డ్రగ్స్‌తో యువత భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ బీఎస్ రెడ్డి, వైద్యాధికారి స్పందన, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలబాలికలను సమానంగా చూడాలి

- జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి



మాట్లాడుతున్న కల్యాణి

శాయంపేట : బాల, బాలికలను సమానంగా చూడాలని జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 100రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఫణిచంద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి హాజరై మాట్లాడారు. బేటీ బచావో బేటీ పడావో పథకంతో పాటు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. బాలబాలికలకు సమస్యలు తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్ 1098, 181కు ఫిర్యాదు చేయాలని వివరించారు. తల్లిదండ్రులను బాలబాలికలను సమానంగా చూడాలని, వివక్ష చూపొద్దని అన్నారు. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరవర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునితారెడ్డి, మంజుల, డీహెచ్ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, మానస, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక..

- విద్యార్థిని బలవన్మరణం
- నమిలిగొండలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబీకులు



రితీష (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నమిలిగొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపూండ్ర స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రితీష (16) శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదివింది. ఇంటర్ విద్య కోసం తల్లిదండ్రులు.. రితీషను భీమదేవరపల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో చేర్పించారు. అయితే అక్కడ హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేదని చెప్పగా నచ్చచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాస్టల్‌లో ఉండనని చెప్పడంతో తండ్రి వెళ్లి రితీషను ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన (ఆదివారం) తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా రితీష గడ్డి నివారణ మందు తాగి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో వ్యవసాయ బావుల వైపునకు వెళ్తున్న వారికి తాను గడ్డి నివారణ మందు తాగానని, మా నాన్నకు చెప్పాలని పేర్కొంది. దీంతో వారు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తల్లిదండ్రులు వెంటనే ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న రితీషను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుమార్తె అర్ధాంతరంగా తనువు చాలించడంతో మృతదేహంపై పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐరాజు తెలిపారు. కాగా, నమిలిగొండకు చెందిన బీఆర్ఎస్ మండల మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు పెద్దపూండ్ర స్వాతిరెడ్డి కుమార్తె రితీష మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పదవి లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



దామెర : మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : పదవీ లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాజీ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విరమణ అనేది పదవీకి మాత్రమేనని, ప్రజాసేవకు కాదని అన్నారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని మాజీ ప్రజాప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంజూరైన పనులను రద్దు చేయడం బాధాకరమన్నారు. కాలయాపన చేయకుండా ప్రజాపాలనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. మాజీ జెడ్పీటీసీ గరిగె కల్పన, మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్ అలీ, మాజీ ఎంపీటీసీలు పోలం కృపాకర్ రెడ్డి, గండు రాము, సంగరబోయిన మౌనిక, గోవిందు సంధ్య, మాజీ సర్పంచ్‌లు పున్నం రజిత, పుల్యాల రాణి, శ్రీనివాస్, సాంబయ్య, రజితను ఘనంగా సన్మానించారు. జిల్లా నాయకుడు వెకటేశ్వర్‌రావు, నాయకులు మల్లయ్య, రాజు, నవీన్, మోహన్, సుదర్శన్, ఏపీఓ శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, రాణి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెన్నారావుపేట : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన జరుపుల తారోనీ ఇల్లు కూలిపోగా ఆమెకు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు బాదావత్ వీరన్న మంగళవారం రూ.2,500 సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. నాయకులు గుగులోతు వీరన్న, గుగులోతు సత్యం, యాకూబ్ ఉన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ విజయ

కమలాపూర్ : మండలంలో వేళాపాల లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని, అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేసి 24 గంటల నిరంతర విద్యుత్ అందించాలని మాజీ సర్పంచ్ కట్కూరి విజయ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం గృహాలకు, వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ అందించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేళాపాల లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తోందని ఆరోపించారు. కానిపర్తి లైన్‌లో ఏ సమస్య వచ్చినా కమలాపూర్-పనగట్ల ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారని తెలిపారు. బ్రేకర్లు ఏర్పాటు చేయకుండా విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రోజుకు కనీసం పదిసార్లు కరెంట్ పోతోందని, గంటల తరబడి అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేస్తే స్పందించక పోగా సరైన సమాధానం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్థిక లావాదేవీల కోసం బ్యాంకులకు వెళ్తే విద్యుత్ సరఫరా నిలిచిపోతున్న కారణంగా బ్యాంకు సేవలు నిలిచిపోయి ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరందుకున్నాయని, వ్యవసాయ విద్యుత్‌తో పాటు గృహ విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని ఆమె కోరారు. విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ విషయమై విద్యుత్ శాఖ ఏడీ పైడయ్యను వివరణ కోరగా కానిపర్తి లైన్‌లో మరమ్మతు కారణంగా ఓ విద్యుత్ టవర్ స్థానంలో కొత్త పోల్ ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపి వేశామని వివరణ ఇచ్చారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- కాపర్ వైరు, ఆయిల్ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లిలో వ్యవసాయ విద్యుత్ కోసం అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. రూ.44,200 విలువ గల కాపర్ వైరు, ఆయిల్ చోరీ చేశారు. ఉప్పల్ సెక్షన్ ఏఈఈ కె.సంపత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంభునిపల్లిలో వర్ధ శ్రీకాంత్‌రెడ్డి అనే రైతు వ్యవసాయ బావి వద్ద వ్యవసాయ విద్యుత్ కోసం అమర్చిన డీటీఆర్ ఎస్ఎస్ 74/25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని 40 కిలోల కాపర్ వైరుతో పాటు వంద లీటర్ల ఆయిల్ ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీకి గురైన కాపర్‌వైరు, ఆయిల్ విలువ రూ.44,200 ఉంటుందని తెలిపారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

'ఇనగాల'ను కలిసిన నాయకులు



ఆత్మకూరు : కుడా చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు : ఇటీవల 'కుడా' చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఇనగాల వెంకట్రామిరెడ్డిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, మాజీ సర్పంచ్‌లు సామెల్, రాజేందర్, మైనారిటీ రాష్ట్ర నాయకుడు గౌస్ ఉన్నారు.

నడికూడలో..

నడికూడ : వరంగల్ కుడా చైర్మన్‌గా నియామకమైన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు జీల శ్రీనివాస్ ఉన్నారు.

రైతులకు ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలి



దామెర : తహసీల్దార్ జ్యోతివరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



కమలాపూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు



శాయంపేట : డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అంజేస్తున్న నాయకులు

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొదుపర్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద ఖరీఫ్, రబీ పంటలకు కలిపి ప్రతి ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకిచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని, పంటల బీమా యోజనను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సారయ్య, ప్రధానకార్యదర్శులు కోటేశ్వర్, రవీందర్‌యాదవ్, కార్యదర్శులు రమేశ్‌బాబు, భిక్షపతి, మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కోరారు. ఈ మేరకు మంగవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా మండల ఇన్‌చార్జ్ పొడాల మధుకర్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని ఆంక్షలు లేకుండా అమలు చేయాలని అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు అందించాలన్నారు. ప్రధానమంత్రి పంట బీమా యోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వేలేరులో..

వేలేరు : మండల కేంద్రంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి తక్కళ్లపల్లి అమృతరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.

దామెర : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధికారప్రతినిధి, కిసాన్ మోర్చా మండల ఇన్‌చార్జ్ పెద్ది కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మిదేవికి మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండులక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా సాయం, కౌలు రైతులకు రైతు భరోసా ఎకరాకు 15000, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12,000 వెంటనే అందించాలని అన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి పంటల భీమాయోజనను రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, కిసాన్‌మోర్చా జిల్లా అధికార ప్రతినిధి గంకిడి బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పొడాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, శక్తికేంద్ర ఇన్‌చార్జ్ ఎక్కలదేవి రమేశ్, బూత్ అధ్యక్షుడు కన్నె కొమురయ్య, గండు ముకేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అమరధామాన్ని సందర్శించిన ఉపాధ్యాయులు



పరకాల : పట్టణంలోని అమరధామాన్ని ములుగుపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం సందర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పరకాల అమరధామంను పర్యాటక ప్రాంతంగా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అదే విధంగా 1947 సెప్టెంబర్2న పరకాలలో జరిగిన ఘటన (మరో జలియన్ వాలాబాగ్) చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చడం ద్వారా భావి తరాలకు చరిత్రను తెలియజేసినట్లు అవుతుందన్నారు. అమరధామం సందర్శించిన వారిలో ములుగుపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాశం సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు దాసరి రాజేంద్రప్రసాద్, కామిడి సతీష్‌రెడ్డి, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, చంద్రకళ, సంపంగి సదయ్య, నాగరాజు పాల్గొన్నారు.